# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 26, అక్టోబర్ 2025


# ఏసీబీ వలలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్



నస్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ భిక్కు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఆయన అద్దె ఇంటిపై ఏసీబీ అధికారుల బృందం దాడి నిర్వహించింది. రాథోడ్ భిక్కు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహరించేందకు రాథోడ్ ముందుగా 7 లక్షల రూపాయలు లంచంగా డిమాండ్ చేశాడు. పలుమార్లు అభ్యర్థించడంతో మొత్తం 5 లక్షల రూపాయలకు ఒప్పుకున్నాడు. తొలి విడతగా 2 లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ జి. మధు తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఓ ఉద్యోగి సస్పెండ్ అయ్యాడు. అతడిని సస్పెన్షన్ నుంచి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీవో 44 ప్రకారం వేతన సవరణల చేయడం, 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడం, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన భత్యాలు మంజూరు చేయడం, విచారణ నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దాడి అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షలో రాథోడ్ కుడిచేయి వేళ్లు, లంచం డబ్బు తాకిన బనియన్ భాగం పాజిటివ్‌గా తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. రాథోడ్ భిక్కును అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు మిగతా 2లో..

# నేడు బెల్లంపల్లిలో మెగా జాబ్ మేళా

❈ ముఖ్య అతిథులుగా హాజరుకానున్న సింగరేణి సంస్థ డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్లు



బెల్లంపల్లి, ప్రభాతవార్త

నేడు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏఎంసీ నంబర్ 2 క్రీడా మైదానంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సబ్ కలెక్టర్ మనోజ్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధకృష్ణ, నోబల్ ఎన్వవర్ మెంట్ సొసైటి ప్రాజెక్టు మేనేజర్ గోగర్ల శోభన్ బాబులు చెప్పారు. శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు జాబ్ మేళా వివరాలు వారు వెల్లడించారు. సింగరేణి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, నోబల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్ మెంట్ సంస్థ లు సంయుక్తంగా ఈ జాబ్ మేలాను నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. జాబ్ మేళాకు రాష్ట్రంలోని ప్రముఖ 70 కంపెనీలు పాల్గొంటాయాన్నారు. బెల్లంపల్లి పట్టణ పరిసర ప్రాంతాలకు చేందిన దాదాపు 10 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరవుతారని భావిస్తున్నట్లు వారు చెప్పారు. జాబ్ మేళాకు వచ్చేవారికి ఇక్కడే భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు. చేశామన్నారు జాబ్ వేళాలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి అక్కడికక్కడే నియామక పత్రాలు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. జాబ్ మేళా బెల్లంపల్లి పట్టణం పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా మిగతా 2లో..

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

✸ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేస్తూ అనేక చర్యలు మిగతా 2లో..

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌తో సంబంధం లేని వారిని విశ్వసించవద్దు

✪ టీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడిగే బసవపున్నయ్య



నస్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పేరుతో కొందరు వ్యక్తులు కార్యక్రమాలు చేస్తూ జర్నలిస్టులు, ప్రజలు, అధికారులు, నాయకులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వీరిని విశ్వసించవద్దని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రెండు పర్యాయాలు ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన తొట్ల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సంఘాన్ని మాత్రమే ఫెడరేషన్ సంఘంగా గుర్తించాలని ఆయన కోరారు. టీడబ్ల్యుజేఎఫ్ సంఘానికి సంబంధం లేని కొందరు వ్యక్తులు సంఘం పేరుతో కార్యక్రమాలు చేస్తూ, అందరిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారికి లేఖను కూడా పంపుతామని తెలిపారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే 9490099108 చరవాణి నెంబర్ లో తనను సంప్రదించాలని కోరారు.




# ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేయాలి

◆ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

నస్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివవిజన్ పురోగతిపై సమీక్షా సమావవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, 2002 ఎలక్టోరల్ జాబితాలో నియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరీ ఏ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మిగతా 2లో..



## ఏసీబీ వలలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్, 9440446106 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చు. ఎవరైనా లంచం అడిగితే తన సెల్ నంబర్ 9154388963లో సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ జి. మధు తెలిపారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో 129.25 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బెల్లంపల్లిలో మెగా జాబ్ మేళా

(మొదటిపేజీ తరువాయి)

దోహదపడుతుందన్నారు. జాబ్ మేళాకు ముఖ్యతిథులుగా సింగరేణి సంస్థ ప్రాజెక్ట్ ప్లానింగ్ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, స్థానిక ఎమ్మెల్యే, నోబల్ డ్యుకేషనల్ ఎంపవర్ మెంట్ సంస్థ సీఎండీ దంతురి సురేష్ కుమార్‌లు హాజరై జాబ్ మేళాను ప్రారంభిస్తారని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మందమర్రి ఏరియా ఎస్ఓ టూ జీఎం విజయప్రసాద్, బెల్లంపల్లి ఏసీపీ ఏ. రవికుమార్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సెక్యూరిటీ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

### - రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. ఇందులో కేటగిరీ లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బి లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సి లో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. అన్ని కేటగిరీలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సి, క్యాటగిరి డి లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. కేటగిరీల వారీగా బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు, సంబంధిత అధికారులతో రివిజన్ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. బిఎల్ఓ, సూపర్ వైజర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ అందించి సహాయ ఎన్నికల అధికారి సమక్షంలో రోజు 2 పోలింగ్ కేంద్రాల వివరాలు యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని, 10 రోజులలోగా కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్యామ్ లాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయబడిన కేటగిరి ఏ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని, తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్ లో నమోదు చేయబడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సి, క్యాటగిరి డీ లలోని ఓటర్లను కేటగిరి ఏ కు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఎఈఆర్ఆఓల ఆధ్వర్యంలో బిఎల్ఓ సూపర్ వైజర్లు, బిఎల్ఓలు బిఎల్ఓ యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్ వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మొదట కేటగిరి ఏ ఓటరు జాబితాను బిఎల్ఓ యాప్ ద్వారా నిర్ధారించిన తర్వాత కేటగిరి సి, డి లను కేటగిరి ఏ కు లింక్ చేయడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో ఇంజనీర్ కిరీటి జయంతి వేడుకలు



**జైపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ దివంగత సూపరింటెండెంట్ ఇంజనీర్ కిరీటి జయంతి వేడుకలను శనివారం సిసిసిలో గల సాయి అనాధ వృద్ధాశ్రమంలో ఎస్టిపిపి అధికారులు నిర్వహించారు. ఎస్.టీ.పి.పి ఈడి చిరంజీవి, ఎస్.టీ.పి.పి జిఎం నరసింహ రావులు పాల్గొని కేకు కట్ చేశారు. ఈడి సిహెచ్. చిరంజీవి మాట్లాడుతూ కిరీటి భౌతికంగా మన మధ్యన లేకున్నా, ఇలాంటి సహాయ కార్యక్రమాలలో మన వెంటే ఉంటారన్నారు. కిరీటి జయంతి సందర్భంగా ప్లాంటు అధికారుల సహకారంతో వృద్ధాశ్రమంలో అనాధులకు పండ్లు అలాగే చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్వెటర్లు (ఉన్ని దుస్తులు) క్యాప్‌లను పంపిణి చేశారు. అనంతరం అధికారులు దివంగత ఇంజనీర్ కిరీటికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పిసిఎస్) అండ్ చీఫ్ (ఓ అండ్ ఎం) మదన్మోహన్, డీజీఎం(ఈ అండ్ ఎం) పంతులా, డీజీఎం(ఓ అండ్ ఎం) వీర బ్రహ్మం , ఎస్.ఓ.టు ఈడి వెంకటయ్య, డిప్యూటి సూపరింటెండెంట్ ఇంజనీర్ రాకేశ్, ఇంజనీర్‌లు రాకేశ్, ఖయ్యుం ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముండ్ల పొదల తొలగింపు



**బోథ్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

బోథ్ మండలంలోని పొచ్చెర ఎక్స్ రోడ్ నుండి చించోలి గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ముండ్ల పొదలు దట్టంగా పెరిగి ప్రమాదాలకు నెలవుగా మారాయి. అలాగే నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. దీంతో శనివారం అటవీశాఖ సౌజన్యంతో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తిగా ముళ్ల పొదలను తొలగించారు. అంతేకాకుండా చెట్ల పొదలు గుబురుగా పెరగడంతో అడవి జంతువులకు పందులకు నివాసంగా మారి రోడ్డుమీద సంచరించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సందర్భాలు కోకోల్లాలు. దీంతో అటవీ శాఖ తోడ్పడుతో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ తొలగించారు. దీనికి పూర్తి మద్దతుగా ఫారెస్ట్ వారు సహకరించారు. ఈ క్రమంలో ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ప్రజలు ఆటో యూనియన్ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇలా నేచర్ సొసైటీ సంస్థ సమాజ హితం కోసం పాటుపడడం చాలా గర్వించదగ్గ విషయమని వారి సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ నాగారావు, బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ, ఉపాధ్యక్షుడు దాసరి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



## గోపుర నిర్మాణానికి భూమి పూజ

**నేరడిగొండ, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

మండలంలోని కుంటాల గ్రామంలో రామారావు మహారాజ్ విగ్రహ గోపురానికి గ్రామస్థులతో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసిన ఆడే గజేందర్. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొచ్చినట్లయితే సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ రామారావు విగ్రహ గోపుర నిర్మాణం కోసం నాయకులకు విన్నవించినా ఎవరు పట్టించుకోలేదని, కుంటాల గ్రామానికి వచ్చిన గజేందర్ దృష్టికి తీసుకెళ్లగా శనివారం 2 లక్షలతో గోపుర నిర్మాణానికి భూమి పూజ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

**మామడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త**


మండలంలోని బండలకనపూర్ గ్రామానికి చెందిన పంబ ముత్యం, స్వప్న దంపతుల ద్వితీయ కుమార్తె అక్షయ ఇటీవల వెలువడిన పరీక్ష ఫలితాలలో మెడికల్‌లో ఏం.బి.బి.ఎస్ సీటు సాధించిన సందర్బంగా గ్రామ యువకులు, గ్రామస్తులు సన్మానించారు. మారుమూల గ్రామం నుండి మెడికల్ సీటు సాధించిన విద్యార్థినికి పలువురు అభినందించారు. ఇందులో తిరుమలేష్, ముత్యం, ముత్యం, సచిన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సదరం క్యాంపుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి




## - సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్



ఆసిఫాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

దివ్యాంగ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ పునరుద్ధరణ కొరకు ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్ అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, డిపిఎంలు, ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఈఓ మాట్లాడుతూ పింఛన్ల పునరుద్ధరణలో భాగంగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిని అంగవైకల్య నిర్ధారణ పరీక్షల కొరకు ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేయాలని, పరీక్షలకు వచ్చే దివ్యాంగులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్ల పునరుద్ధరణ కొరకు ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. దాదాపు 600 మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల పింఛన్ పునరుద్ధరణ కొరకు జిల్లాలోని జైనూర్, కౌటాల మండలాలలో ప్రత్యేక శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని, నిర్ధారణ పరీక్షలకు స్లాట్ బుకింగ్ కొరకు స్వయం సహాయక సంఘాల మహిళలు, విఏలు, సిసిలు, ఎపిఎంలతో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరూ సదరం శిబిరానికి హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, సదరం శిబిరంలో దివ్యాంగులతో పాటు వారికి సహాయకులుగా వచ్చే వారి కోసం సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రామకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఫైవ్ స్టార్ రేటింగ్‌లో దిలావర్పూర్ పాఠశాలలు

### సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దిలావర్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త



ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయం రేటింగ్‌లో దిలావర్పూర్ మండలానికి చెందిన సాంగ్వి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 5 స్టార్ రేటింగ్ సాధించాయి. దీంతో ఆ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. పరిశుభ్రత ప్రమాణాలను ఆధారంగా తీసుకొని కేంద్రం రేటింగ్ ప్రకటిస్తుంది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 1053 పాఠశాలలో ఆన్‌లైన్‌లో పాల్గొనగా 14 పాఠశాలలు గుర్తింపు పొందాయి. దీనిలో దిలావర్పూర్ మండలానికి చెందిన రెండు పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. చేతుల పరిశుభ్రత, సురక్షితమైన తాగునీరు, మరుగుదొడ్ల వినియోగం, విద్యార్థుల ప్రవర్తన, మార్పులు, నిర్వహణ వ్యవస్థ, మిషన్ లైఫ్ వంటి ఆరు అంశాలపై 60 ప్రశ్నలు రూపొందించి సంబంధిత ఫోటోలను ఆన్‌లైన్‌లో సమర్పించడంతో రేటింగ్ ఇచ్చింది. ఇందులో ప్రధానోపాధ్యాయుల సుగుణ, ఎస్ఓ అపర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్

కెరమెరి, అక్టోబర్ 25, ప్రభాతవార్త

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్ పాల్గొని కెరమెరి, జూనియర్ కాలేజ్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు, పోలీస్ వ్యవస్థలోని రికార్డులు, విధులు, కేసు దర్యాప్తు విధానాలు, సామాజిక భద్రతా చర్యల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ, పోలీసులు సమాజ శాంతి భద్రత కోసం అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. ప్రజల సహకారం ఉన్నప్పుడే సమాజంలో నేరాలు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఈసీసీఈ డే పేరెంట్ అంగన్వాడీ టీచర్ మీటింగ్

లక్షెట్టిపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త

అంగన్వాడి సెంటర్‌లో ఈసీసీఈ అండ్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకి నేర్పిస్తున్నటు వంటి ఆక్టివిటీస్, రైమ్స్, కరికులం పేరెంట్స్‌కి వివరించడం జరిగింది. ప్రైవేట్ స్కూల్‌కి ధీటుగా అంగన్వాడీ సెంటర్‌లో కూడా ఎల్‌కేజీ, యూకేజీ, వయస్సుకు తగ్గట్టు ఆక్టివిటీస్ చెప్పడం జరుగుతుంది. అలాగే పిల్లల యొక్క పెరుగుదల పర్యవేక్షణ గురించి చెప్పడం జరిగింది. అనంతరం పిల్లలు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ రైమ్స్ పాడటం జరిగింది. కథలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ వాణి, ప్రాథమిక పాఠశాల టీచర్ సునీత, కొత్తపల్లి అంగన్వాడీ టీచర్ తిరుమల, ఆయా, పిల్లలు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యాధికారి

బజార్‌హత్నూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా ఇంటర్ విద్య అధికారి జాదవ్ గణేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేసారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని, మంచి ఫలితాలను సాధించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యాపకులకు పలు సూచనలు సూచించారు. ఈ విద్య సంవత్సరం కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కళాశాల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. అంతేకాకుండా సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ సకాలంలో చేయించాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే సునీల్, డిఐఈఓ ఆఫీస్ సూపరెన్డెంట్ మొహసిన్ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఎన్నికలకు సిద్ధం కండి

బోథ్, అక్టోబర్ 25, ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావును శనివారం తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తాజా రాజకీయ పరిణామాలపై, డిసిసి ఎంపిక స్థానిక సంస్థల్లో పార్టీ పరిస్థితి పై సమాలోచనలు జరపడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలకు బోథ్, సోనాల మండలాల పరిధిలోని కార్యకర్తలందరిని సిద్ధం చేయాలని సోయం పిలుపునిచ్చారని, అలాగే దండారి చెక్కులు, ఆదివాసి గ్రామంలో పోలం బాట ద్వారా వ్యవసాయ దారులు వేయాలని తెలిపినట్లు అధికార ప్రతినిధి చంటి పేర్కొన్నారు.



## వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు

మామడ, అక్టోబర్25, ప్రభాతవార్త

మండలంలోని దిమ్మదుర్తి అటవీ రెంజ్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జి. రాధిక జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ నిర్మల్, జిల్లా అటవీ అధికారి ఎస్ఏ నాగిని భాను, అటవీ వన్యప్రాణి సంరక్షణ చట్టాల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దిమ్మదుర్తి రెంజ్ అటవీ శాఖ అధికారులు టి శ్రీనివాసరావు, జి వి రామకృష్ణారావు, డిఆర్ఓ నజీర్ ఖాన్, ఎఫ్ యస్ ఓ శ్రీనివాస్, అన్నపూర్ణ, జాఫర్ ఎఫ్బి ఓ లు నిర్మల్ జిల్లా అడ్వొకెట్లు బత్తుల రంజిత్, రమణారావు లీగల్ చీఫ్ రాజలింగం, లింగగౌడ్, సిరాజ్, మధుకర్, నల్లుర్తి, వెంకటాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం తదనంతరం సివిల్ జడ్జి రాధిక తూర్కం చెరువు ఎకో టూరిజంను సందర్శించి పక్షులను భయనాక్యులర్ ద్వారా వీక్షించారు.

## జిఐ-బి, జిఐ-సి గదులలో ప్రజావాణి కార్యక్రమం

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త



ఈ నెల 27న సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జీ1-బి, జీ1-సి గదులలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ దరఖాస్తులను అధికారులకు అందించాలని తెలిపారు.

# మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తుల అరెస్ట్

## జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు

**బెల్లంపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండల మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్‌ను కిడ్నాప్ చేసిన వ్యవహారంలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో కిడ్నాప్‌కు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సంఘటనలో నిందితుల వద్ద నుండి ఒక ఎర్టిగా కారు, 20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుల్లో ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్ తాండూరు మండలం అచ్చులాపూర్ శివారులో లేని భూమి చూపెట్టి రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులను నమ్మించి 80 లక్షలు వసూలు చేశారని తెలిపారు.ఈ ఘటనలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో గోమాస శ్రీనివాస్ తో పాటు,అల్లం శీను,ఇప్ప భూమయ్య మరి కొంతమంది వ్యక్తులపై కేసు నమోదు అయిందన్నారు. పులిమడుగు గ్రామానికి చెందిన బాధితులు బండి సాగర్, బండి మల్లేష్‌లు గోమాస శ్రీనివాసును కిడ్నాప్ చేసేందుకు 2 లక్షల 40 వేలు సుఫారిని మాట్లాడారన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని సుభాష్ నగర్ కు చెందిన గొల్ల సంపత్, బెల్లంపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మైలారపు భీమేష్ అలియాస్ రవితో గొమాస శ్రీనివాసు ను కిడ్నాప్ చేయాలని చర్చించారని ఏసిపి వివరించారు. అంతేకాకుండా బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తికి చెందిన సాదిక్,డ్రైవర్ సాయి తేజ గోమస శ్రీనివాసు కదలికలపై నిఘా పెట్టారని తెలిపారు.ఈ నెల 23 వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో బెల్లంపల్లి రోజ్ గార్డెన్ వద్ద గోమాస శ్రీనివాసును అడ్డగించి బలవంతంగా ఎర్టిగా కార్ లో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారని ఏసిపి తెలిపారు. కొమురంభీం జిల్లా కాగజ్ నగర్, పెంచికల్‌పేట్, దహేగాం ప్రాంతాల వైపు కారులో తీసుకుపోయారని తెలిపారు. కిడ్నాప్ గురైన గొమాస శ్రీనివాస్ భార్య అదే రోజు తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏసిపి పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న తాళ్ల గురిజాల పోలీసులు ఐదు టీంలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఎర్టిగా కారు మంచిర్యాల,లక్షెట్టిపేట మీదుగా హైదరాబాద్ కు వెళ్లారని ఏసిపి వివరించారు. శనివారం జన్నారంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఏర్టిగా కారును తనిఖీ చేయగా కార్‌లో గోమాస శ్రీనివాస్‌తో పాటు కిడ్నాప్‌కు పాల్పడ్డ మైలారపు భీమేష్, సాదిక్, సాయి తేజ, బండి మల్లేష్, బండి సాగర్‌లను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి ఎర్టిగా కార్‌తో పాటు 20 వేల నగదు ను స్వాధీనం చేసుకొని, నిందితులను జ్యుడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి తెలిపారు.ఈ కేసులో నిందుతుడైన గొల్ల సంపత్ పరారీలో ఉన్నాడని ఏసీపీ వివరించారు. ఈ కేసును 24 గంటల్లో చేదించిన సబ్ డివిజన్ పోలీసులందరినీ ఏసిపి రవికుమార్ అభినందించారు.



## అకాల వర్షంతో పత్తి రైతు దిగాలు

**సారంగాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

రైతులు జూన్ మాసంలో వర్షాలు ప్రారంభం అవడంతో విత్తనాలు వేసినారు. వేసిన పంటలు పెరిగే క్రమంలో ఆగస్టు, సెప్టెంబర్ మధ్య కాలంలో భారీగా వర్షాలు పడడం జరిగింది. ఈ సమయంలోనే పత్తి పంటకు కాయలు పట్టే సమయం. కానీ భారీ వర్షాలు కురియడంతో చెట్టుకు తక్కువ కాయలు కాసినాయి.ఎంతో పెట్టుబడి పెట్టి నా పంట సరిగా లేకపోవడంతో రైతు దిగాలు పడినాడు.అప్పటికే అధిక వ్యయం అయినది. ఎకరానికి 10 క్వింటాళ్లు దిగుబడి వచ్చేది కానీ వర్షాల ప్రభావంతో మూడు క్వింటాలే వచ్చేలా ఉంది. తను పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా వెళ్లడం లేదు. అక్టోబర్ మాసంలో పత్తి ఏరుదాము అనుకుంటున్నా సమయంలో మూలుగుతున్న నక్కపై తాటికాయపడినట్లు చేనులో పత్తి ఏరే సమయంలోనే మళ్ళీ వర్షాలు కురవడంతో ఉన్న పంట కాస్త చేతికందకుండా పోయింది.చేనులో ఉన్న కొద్దిపాటి పత్తిని ఏరి మార్కెట్‌కి తీసుకుపోతే వర్షంలో నానిపోయింది. అని గిట్టుబాటు రేటు పెట్టడం లేదు. ఎంతోకొంతకు అమ్ముకోవడం జరుగుతుంది. ఈ అకాల వర్షాల కారణం ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్న సిసిఐ వారికి ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేస్తున్న పత్తికి తేమశాతం, నానిపోయినది, అని చూడకుండా గిట్టుబాటు ధరను కల్పించాలని ఆదేశాలను జారీ చేసి రైతులను ఆదుకోవాలని కోరినారు.

## 27న ఏ4 మద్యం దుకాణాల కేటాయింపు

**- మంచిర్యాల జిల్లా ఆబ్కారీ, మద్య నిషేధశాఖ అధికారి నందగోపాల్**



**నస్పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీ విధానం 2025 -27లో భాగంగా ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల పివిఆర్ గార్డెన్స్ లో ఏ4 మద్యం దుకాణాలకు కేటాయింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా ఆబ్కారీ, మద్య నిషేధశాఖ అధికారి నందగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు/ ఆధీకృత వ్యక్తులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

## రేపు మద్యం దుకాణలకు లక్కీడ్రా

**- ఆసిఫాబాద్ జిల్లా అబ్కారి అధికారి జ్యోతి కిరణ్**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీ 2025-27లో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని 32 మద్యం దుకాణలకు సోమవారం లక్కీ డ్రా నిర్వహిస్తునట్లు జిల్లా అబ్కారి శాఖ అధికారి జ్యోతి కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 23 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన 32 మద్యం దుకాణాలకు గాను 680 దరఖాస్తులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఇట్టి మద్యం దుకాణాలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సమక్షంలో లక్కీ డ్రా ఉంటుందని, దరఖాస్తుదారులు ఉదయం 9.00 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి అవార్డు

**మామడ, అక్టోబర్ 25, ప్రభాతవార్త**




మామడ మండలం సంతోష్ నగర్ విద్యార్థుల ముఖ గుర్తుంపు హాజరులో ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డ్ దక్కింది. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్యాగ రాజేంద్ర శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవనరుల కేంద్రంలో సమగ్ర శిక్ష ఏఎస్పిడి శ్రీమతి రాధారెడ్డి, వరంగల్ ఆర్జెడి కే సత్యనారాయణ రెడ్డి, నిర్మల్ జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. పాఠశాలలో ఉన్న 65 మంది విద్యార్థులకు గాను ప్రతిరోజు 98 నుంచి 100 పిల్లలు రావడం, ప్రధానోపాధ్యాయులు ద్యాగ రాజేంద్ర సైతం పాఠశాల విద్యార్థుల కంటే చాలా ముందుగానే వెళ్లడంతో ఈ గుర్తింపు వచ్చింది. జిల్లా నుండి ఈ అవార్డును అందుకున్న ఏకాక వ్యక్తిగా రాజేంద్ర నిలిచారు. మామడ మండలంలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అవార్డు స్వీకరించిన రాజేంద్రకు అభినందనలు తెలియజేశారు.



## అంగరంగ వైభవంగా ప్రారంభమైన ప్రతిష్టాపన కార్యక్రమాలు

**దిలావర్‌పూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

దిలావర్పూర్ మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పంచలోహ శ్రీ రేణుక ఎల్లమ్మ సహిత కాలబైరవ విగ్రహ శిఖర ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట విగ్రహాలను డప్పు చప్పుళ్లతో మహిళలు మంగళ హారతులు పట్టుకొని శివసత్తుల నృత్యాలతో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమంలో చేపట్టారు. వాయిద్య వేద స్వస్తి వచనములతో గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, రూత్విక్ వర్ణణము, యాగశాల ప్రవేశము, అఖండ దీపారాధన, నవగ్రహ వాస్తు, యోగిని, క్షేత్రపాల, సర్వతోభద్ర, మండప దేవతా స్థాపన పూజలు, హోమాలు, చండీహోమము, జలాధివాస, ధన్యాదివాస, పుష్పాదివాస ఫలాదివాస, శాయ్యాదివాసములు, హారతి, మంతపుష్పము, చతుర్వేద సేవలు, తీర్థ ప్రసాదాల వితరణ వంటి కార్యక్రమం నిర్వహించారు. రేపు ప్రతిష్టాపన కార్యక్రమాలు ఉంటాయని అధిక సంఖ్యలో భక్తులు చేరుకోవాలని తెలిపారు.

## సిఎఫ్ఎల్ జన సురక్షా, ఆర్థిక అవగాహన కార్యక్రమం

**లక్షెట్టిపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలంలోని దౌడేపల్లి గ్రామంలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ ఆధ్వర్యంలో జన సురక్షా యోజన, ఆర్థిక అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ అపర్ణ, బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథ్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు రవీందర్, హరీష్, నూతన్, యూబీఐ బీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ రీజినల్ అధికారిని అపర్ణ మాట్లాడుతూ... ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రూ.2,00,000 చెక్కు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద మరణించిన కస్టమర్ తోగాటి రాము భార్య తోగాటి తిరుమలకి రూ. 2,00,000 విలువైన చెక్కును అందజేశారు. ఈ క్లైయిమ్ 2025 అక్టోబర్ 1న ఆమోదించబడింది అని తెలిపారు. ప్రతి కుటుంబం తమ భవిష్యత్ భద్రత కోసం భీమా పథకాలలో తప్పనిసరిగా చేరాలి అని తెలిపారు.






## విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

**బెల్లంపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివాలని వెంకటా చారి సెక్రెటరి (సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ) అన్నారు. శనివారం రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి హై స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, వసతులు, వార్షిక ఫలితాల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులను స్టేజి పై భయం లేకుండా మాట్లాడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశలో 7,8,9,10 వ తరగతుల విద్య ప్రధానమని అన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి మాత్రమే కాకుండా ప్రతి అంశం పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలను ఉపాద్యయులకు సూచించారు. అంతకుముందు జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఇంచార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అధికారులతో కలిసి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం రాజమల్లు, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, కరస్పాండెంట్ మండల శ్రీనివాస్, ప్రధానోపాద్యయులు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్ల రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి పేరు నమోదు చేసుకోండి

**సారంగాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఈనెల 27వ తేదీన నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించబడడం జరుగుతుంది. కావున మన సారంగాపూర్ మండలం నుండి అన్ని గ్రామాల యువకులు, విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి, పోలీస్ అమరవీరులకు నివాళులు అందజేయాలని కోరుచున్నాము. ఆసక్తి గల యువకులు మీ వివరాలను పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోగలరని తెలిపినారు. 27వ తేదీన అందరూ ఉదయం 8.30 గంటలకు సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌కి వస్తే అక్కడ నుండి నిర్మల్ తీసుకువెళ్లడం జరుగుతుంది అని తెలిపినారు.





# బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

ఆసిఫాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి. శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని స్థానిక ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో కేరమెరికి మండలంకు చెందిన మాజీ జడ్పీటీసీ కలాం, పార్టీ మండల అధ్యక్షులు రాథోడ్ అంబాజీ ఆధ్వర్యంలో అనార్పల్లి, తుమ్మగూడ, సొమ్లగూడ, కొలంగూడ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల ముఖ్య నాయకులు వారి అనుచరులతో దాదాపు 200 మంది బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరారన్నారు. లంబాడీ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే చెందిందని, తండాల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికార పార్టీ గ్రామ పంచాయతీలకు రూపాయి నిధులు ఇవ్వడం లేదని, దీంతో పంచాయతీలలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఏవర్గం కూడా సంతృప్తిగా లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోలా సరస్వతి, రూప్లాల్, యూనిస్, పరుశురాం నాయక్, కృష్ణ, వెంకట్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు

**వేమనపల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

వేమనపల్లి నుండి సుంపుటం వరకు ఉన్న రహదారిపై మూల మలుపులు వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయాని మూల మలుపులు... ప్రమాదపు పిలుపులు అనే శీర్షికన ప్రభాతవార్తలో గురువారం ప్రచూరితం కాగా సుంపుటం మాజీ సర్పంచులు కుబిడే వెంకటేశం, కొండగొర్ల బాపు ఇరువురు కలిసి ట్రాక్టర్ సాయంతో మూలమాలుల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల వలన ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో వేమనపల్లి నుండి ముక్కుడిగూడెం వరకు పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజాసమస్యలను అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నిత్యం తెలుపుతూ వాటి పరిష్కార దిశగా వార్త కథనాలు అందిస్తున్న ప్రభాతవార్త పత్రికకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సోషల్ ఆడిట్ పారాస్‌పై వీడియో కాన్ఫరెన్స్

**జైపూర్, అక్టోబర్ 25, ప్రభాత వార్త**




పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ సోషల్ ఆడిట్ పారాస్ పైన ఎంపిడీఓ, ఎంపిఓ, ఏపిఓ, ఈసి టాస్క్ పంచాయతీ కార్యదర్శులతో శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జైపూర్ మండలం రైతు వేదికలో ఎంపిఓ బావు రావు సమక్షంలో జైపూర్ మండల ఈ.జి.ఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి మండలం వీక్లీ బేసిస్ కనీసం 200 పారస్ క్లోజ్ చేయాలని ఆదేశించారు. 2018-19 నుండి అడిట్ పారాస్ అన్ని నవంబర్‌లోపు ఎక్స్‌ప్లనేషన్ ఏవిడేన్స్ సమర్పించి వెంటనే పారస్ క్లోజ్ చేయాలని ఆదేశించినారు. అనంతరం ఎం.పి.ఓ బాపు రావు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల డీసీబీ కేవలం 14 శాతం ఉన్నందున వసూలు వేగవంతం చేసి ఈ నెల ఆఖరుకు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ వెంటనే రెన్యువల్ చేయించాలని, గ్రామాల్లో బిక్షాటన చేసే వారి వివరాలు సేకరించాలని, ఎవరైనా వీధి కుక్కల దాడికి గురైతే వారి వివరాలు సేకరించాలన్నారు. నేటి వరకు ఎం.ఏ.ఎస్ పూర్తి చేయాలని, గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీ అడిట్ పూర్తి చేయాలని, అన్ని రికార్డులు మెయింటెన్ చేస్తూ, రికార్డ్‌లను అప్డేట్ చేయాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. ఏ.పి.ఓ బాలయ్య, ఈ.సి రాజమొగిలి, టీ.ఏలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రజాసేవలోకి రావాలని పాదయాత్ర

**లక్షెట్టిపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం మెరుగుపడాలని వెంటనే ప్రజాక్షేత్రంలో పాల్గొనాలని కోరుతూ లక్షెట్టిపేట మండలంలోని సూరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మల్లికార్జున్ సూరారం గ్రామం నుండి దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానం వరకు కాలినడక వెళ్లి సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు కాలినడకన వెళుతున్న మల్లికార్జున్‌కు ఘనంగా స్వాగతించి పూలమాలలు వేసి వారి వెంబడి పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం మెరుగుపడి ప్రజాసేవలోకి అందుబాటులోకి రావాలని కోరుతూ కాలి నడకన వెళుతున్న మల్లికార్జున్‌ను పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, మాజీ సర్పంచ్ బియ్యాల సుధాకర్, మాజీ వైఎస్ ఎంపీపీ పెండెం రాజు, మైనారిటీ సీనియర్ నాయకులు మహ్మద్ షేక్ అలీ, కాంగ్రెస్ నాయకులు లింగంపెల్లి తిరుపతి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఆమె భర్త, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే బెల్లంపల్లి రడగంబాల బస్తికి చెందిన ఉప్పట్ల సుభాష్ తన భార్య కవిత, కూతురు భార్గవితో కలిసి ఈనెల 24న ఉదయం బెల్లంపల్లిలోని బంధువుల వివాహానికి వెళ్లి, సాయంత్రం తిరుగు ప్రయాణంలో బొక్కలగుట్ట సమీపంలోని సర్వీస్ రోడ్డులో సాయంత్రం 6:45 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వారి స్కూటీ వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో కవిత కిందపడిపడి కొంత దూరం ఈడ్చుకుపోయింది. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి ముగ్గురిని మెడిలైఫ్ ఆసుపత్రికి తరలించారు. అయితే కవిత పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించే క్రమంలో సుల్తానాబాద్ వద్ద మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ తండ్ర మహేష్ గౌడ్‌పై ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ ఎస్సై జి. రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.